క్లుప్తంగా

క్విజ్ విజేతలకు అభినందనలు



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాఘవ కుమారి తదితరులు

సీటీఆర్ఐ: ఓఎన్‌జీసీ క్విజ్ పోటీల్లో ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు బహుమతులు సాధించడం అభినందనీయమని ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవ కుమారి అన్నారు. ఆ మేరకు శనివారం కళాశాలలో విజేతలను అభినందించారు. ఆమె మాట్లాడుతూ క్విజ్ పోటీల్లో ఎం.స్పందన, కె.సరోజ ప్రియదర్శిని, టి.మౌనిక విజేతలుగా నిలిచారన్నారు.

పన్ను చెల్లింపునకు నేడు ప్రత్యేక కౌంటర్లు

రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థ పరిధిలో 2024 –25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలం పన్నులు, నీటి చార్జీలను ఆదివారం నగరపాలక సంస్థ ట్రెజరీలో చెల్లించవచ్చని కమిషనర్ కేతన్ గార్గ్ ప్రకటించారు. పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం సెలవు రోజు కూడా కౌంటర్లు ఉంటాయన్నారు. ఆన్‌లైన్, చెక్కుల ద్వారా ప్రభుత్వ పోర్టల్‌లో కూడా చెల్లించే అవకాశం ఉందన్నారు. అలాగే సమీప సచివాలయంలో పరిపాలనా కార్యదర్శి కూడా పన్నులను కట్టించుకుంటారన్నారు.

అన్నసమారాధన

రాజమహేంద్రవరం సిటీ: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక 49వ డివిజన్ సింహాచల నగర్‌లోని చౌడేశ్వరి రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో గుడి ప్రారంభకులు పితాని వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మాసా రామజోగ్, నందేపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ పరమహంస జయంతి

సీటీఆర్ఐ: స్థానిక రామకృష్ణ మఠంలో శనివారం భగవాన్ రామకృష్ణ పరమహంస జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు జపం, మంగళహారతి, సుప్రభాతం, వేద పఠనం, భజనలు, విశేష పూజలు నిర్వహించారు. 10 గంటలకు హోమం జరిపారు. స్వామి సేవ్యానందజీ మహారాజ్, స్వామి పరిజ్ఞేయానందజీ తదితరులు రామకృష్ణ జీవిత విశేషాలను వివరించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో స్వామీ గీతా సారానందజీ, స్వామీ రఘువీరానందజీ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీల అమలు సాధ్యమేనా?



బాలేపల్లి మురళీధర్

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర బడ్జెట్‌లో బౌండరీ దాటని అంకెలతో సూపర్ సిక్స్ కొడతామంటే ఎలా సాధ్యమవుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పీసీసీ మెంబర్ బాలేపల్లి మురళీధర్ ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై శనివారం ప్రకటనలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీలకు.. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేస్తున్న పనులకు పొంతన లేదన్నారు. ఇదే విషయయే కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తేటతెల్లం చేసిందన్నారు. ఓట్ల కోసం అమలు సాధ్యం కానీ హామీలు గుప్పించి, చేతులెత్తేసామని చెప్పలేక సంక్షేమ పథకాల నిధులకు కోతలు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, రైతుకు సాయం చేసేందుకు సరిపడా నిధులు కేటాయించలేని విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు గ్రామానికి చెందిన చోడదాసి రమణ, కీర్తనలకు ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శనివారం సీఎం సహాయనిధి నుంచి వచ్చిన రూ.10 లక్షలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు నర్సిపల్లి హారిక తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

కడియం: మండలంలో శనివారం 95.4 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో కె.రమేష్ తెలిపారు. వేమగిరితో పాటు పలు గ్రామాల్లో జరిగిన పంపిణీని శనివారం ఆయన పరిశీలించారు.

బంగారం చోరీ

కంబాలచెరువు: స్థానిక ఆల్కాట్ గార్డెన్స్ ప్రాంతంలో బంగారం చోరీకి గురైన సంఘటనపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. చెల్లివారి వీధికి చెందిన ఎలగదూరి శేషారత్నం గత నెల 26వ తేదీన కొత్తపేటలోని బంధువుల ఇంటికి పెళ్లికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి, అందులో ఉంచిన 18 గ్రాముల బంగారం మాయమైంది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల నెరవేరేనా!



ధవళేశ్వరంలో అసంపూర్తిగా నిలిచిన రైతు బజార్

- అసంపూర్తిగా రైతు బజార్
- బయటి దుకాణాల్లో అధిక ధరలు
- కూరగాయలు కొనలేక ప్రజల అవస్థలు

ధవళేశ్వరం: మేజర్ పంచాయతీ అయిన ధవళేశ్వరంలో రైతు బజారు నిర్మాణం కలగా మిగిలింది. సుమారు 60 వేల మంది జనాభా కలిగిన ఈ గ్రామంలో రైతు బజారు ఏర్పాటు చేయాలని గత 15 ఏళ్లుగా గ్రామస్తులు కోరుతూ వస్తున్నారు. ఎట్టకేలకు గతంలో ధవళేశ్వరం పీహెచ్‌సీ పక్కనే స్థలాన్ని కేటాయించారు. కానీ నిర్మాణ పనులు సగంలో నిలిచిపోయాయి. దీంతో బయట మార్కెట్‌లోనే కూరగాయలను కొనుగోలు చేయాల్సి వస్తోంది.

తప్పని అవస్థలు

పేద, మధ్య తరగతి వర్గాలు అధికంగా నివసించే ధవళేశ్వరంలో రైతు బజారు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బయట దుకాణాల్లో ధరలు ఎక్కువగా ఉండడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు బజారుకు వెళ్లాలంటే రాజమహేంద్రవరంలోని ఐఎల్‌టీడీ సెంటర్‌కు వెళ్లాల్సి వస్తోంది. దూరాభారం కావడంతో గ్రామంలోని కూరగాయల దుకాణాల్లోనే కొనుగోళ్లు జరుగుతున్నారు. కూరగాయల ధరలు విపరీతంగా పెరగడంతో బయట కొనేందుకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రైతు బజారులో రైతులే అమ్మకాలు సాగించడం ద్వారా తక్కువ ధరకు లభిస్తాయి. ఈ నేపథ్యంలో ధవళేశ్వరంలో రైతు బజారు ఏర్పాటు చేస్తే పేద, దిగువ మధ్యతరగతి వర్గాలకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.

రైతు బజారును ఏర్పాటు చేయాలి

అధిక సంఖ్యలో ప్రజలు నివసిస్తున్న ధవళేశ్వరంలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. గ్రామంలో ఉంటే మహిళలు సైతం నేరుగా వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసే అవకాశం ఉందన్నారు. వీటితో పాటు వంట నూనెలు, వివిధ రకాల పండ్లు, కోడిగుడ్లు తక్కువ ధరకే దొరుకుతాయన్నారు.

రాజమహేంద్రవరం వెళుతున్నాం



కూరగాయలు కొనుగోలు చేయాలంటే ధవళేశ్వరం నుంచి రాజమహేంద్రవరం రైతు బజార్‌కు వెళ్లాల్సి వస్తోంది. మా గ్రామంలో రైతు బజారు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది. రైతులను కూడా ప్రోత్సహించినట్లు అవుతుంది.

– చొల్లంగి సత్యగిరి, ధవళేశ్వరం

ఆర్థిక భారం



రైతు బజారు లేక ప్రజలపై ఆర్థిక భారం పడుతోంది. అధిక ధరలకు కూరగాయలను కొనుగోలు చేయాల్సి వస్తోంది. ధవళేశ్వరంలో రైతు బజార్ ఏర్పాటు చేస్తే తక్కువ ధరలకే లభించే అవకాశం కలుగుతుంది.

– ముత్యాల జాన్, ధవళేశ్వరం

అసెంబ్లీ సాక్షిగా అబద్ధాల బడ్జెట్



మహ్మద్ ఆరీఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్

ప్రకాశం నగర్: కూటమి ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా అబద్ధాల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని, మైనారిటీ కేటాయింపుల ప్రసంగమంతా అబద్ధాలతోనే సరిపోయిందని మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ మహ్మద్ ఆరీఫ్ అన్నారు. జాంపేటలోని తన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ బడ్జెట్ ప్రసంగం ముస్లిం సమాజాన్ని తీవ్ర విస్మయానికి గురి చేసిందన్నారు. ఇమామ్, మౌజన్ల గౌరవ వేతనాలు చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రూ.ఐదు వేలు, రూ.మూడు వేలుగా ఉండేవన్నారు. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇమామ్‌లకు రూ.పది వేలు, మౌజన్‌లకు రూ.ఐదు వేలు చేశారన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పది నెలల గౌరవ వేతనాలు బకాయిల కోసం అనేక మంది ముస్లింలు విజ్ఞప్తి చేయగా ఈ మధ్యనే ఆరు నెలల వేతనాలు విడుదల చేశారన్నారు. ఇంకా నాలుగు నెలల వేతనాలను కూడా సత్వరమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మసీదుల నిర్వహణ కోసం ప్రతి నెల రూ.5 వేలు అదనంగా ఇస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. ఆ ప్రకారం పది నెలల నిర్వహణ బకాయిలను రంజాన్ ప్రారంభం సందర్భంగా ప్రతి మసీదుకు రూ. 50 వేలు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆధునిక సాంకేతికతతో మంచి ఫలితాలు



ఫెర్టిజన్ సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్లు

ప్రకాశం నగర్: సంతాన సాఫల్యతకు ఆధునిక సాంకేతికత అందుబాటులోకి రావడంతో మంచి ఫలితాలు వస్తున్నాయని ఫెర్టిలిటీ సెంటర్ సీఎండీ డాక్టర్ జ్యోతి అన్నారు. ఫెర్టిలిటీ సెంటర్, రాజమండ్రి అబ్స్టెట్రిక్స్ అండ్ గైనకాలజిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నగరంలో ఫెర్టిజన్ సదస్సు ఉత్సాహంగా జరిగింది. ఈ సదస్సును డాక్టర్ జ్యోతి, పలువురు డాక్టర్లు జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. సుమారు 137 మంది సంతాన సాఫల్య నిపుణులు, గైనాకాలిజిస్టులు, ఆరోగ్య సంరక్ష నిపుణులు హాజరయ్యారు.

అన్నసమారాధన

కడియం: మండల కేంద్రమైన కడియంలోని భ్రమరాంబికా మల్లేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవం, శివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం దాతల సహకారంతో అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాన్ని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పలి శ్రీమన్నారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహిళా పోలీసులకు వైద్య పరీక్షలు



మహిళా పోలీసుకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

కడియం: ప్రపంచ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా కడియం పోలీస్ స్టేషన్ మహిళా సిబ్బందికి కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రాథమిక వైద్య పరీక్షలు చేపట్టారు. రక్తపోటు, షుగర్ తదితర పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే మినర్వా స్కూల్లోని పదో తరగతి విద్యార్థినులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు ఏ విధంగా రాయవచ్చో వివరించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎస్సైలు ధనలక్ష్మి ప్రసన్న, దుర్గాప్రసాద్, సిబ్బంది సురేష్‌బాబు, రమణ, అసోసియేషన్ నాయకులు బళ్ల శ్రీనివాసరావు, పి.దేవానందం, యు.ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

సత్యదేవ నర్సరీ సందర్శన



సత్యదేవ నర్సరీలో తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ సభ్యులు

కడియం: కడియపులంకలోని పుల్లా పెద సత్యనారాయణకు చెందిన సత్యదేవ నర్సరీని శనివారం తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ బృందం సందర్శించింది. అకాడమీ ఏసీడీసీపీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో 50 మంది ఫారెస్ట్ సెషన్ ఆఫీసర్లు ఈ సందర్శనలో పాల్గొన్నారు. వారికి నర్సరీ అధినేత పెద సత్యనారాయణ వివిధ రకాల దేశ, విదేశీ మొక్కలను గురించి తెలియజేశారు. కార్యక్రమంలో మెర్ల కృష్ణ, నర్సరీ రైతులు పాల్గొన్నారు.

మానవ జీవితంలో సైన్స్ చాలా కీలకం



అధ్యాపకుడు వెంకటరావును సత్కరిస్తున్న స్కూల్ ప్రతినిధులు

కంబాలచెరువు: మానవ జీవితంలో సైన్స్ చాలా కీలకమని ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకులు కె.వెంకటరావు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా సీతంపేట చైతన్య పాఠశాలలో ప్రిన్సిపాల్ పి.మహేశ్వరరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటరావు ఎక్స్‌పోను ప్రారంభించి విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను పరిశీలించారు. వాటిని తయారు చేసిన విధానం, ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను ఏజీఎం ఎంవీ సురేష్, రీజనల్ ఇన్‌చార్జి వి.ఉదయ్ శంకర్, జోనల్ కో ఆర్డినేటర్ కిరణ్ పాండే, సి.ఇన్‌చార్జి కుసుమ, డీన్ జేపీ సాయికిరణ్ అభినందించారు.

ఉత్సాహంగా సంగీత కార్యశాల



సమావేశంలో మాట్లాడుతున్న గోపీకృష్ణ

సీటీఆర్ఐ: ప్రతి స్వరం శరీరంలోని ఏడు చక్రాలతో సంధించబడ్డాయని సంకీర్తన శ్రీ చీమలమర్రి గోపీకృష్ణ అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో జరిగిన సంగీత కార్యశాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రాగం అనుసంధించబడిన చక్రంతో ప్రభావితమవుతాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డీవీ రమణమూర్తి మాట్లాడుతూ ఏడు స్వరాలు శాస్త్రీయ భారతీయ సంగీతానికే కాక పాశ్చాత్య సంగీతానికి కూడా వెన్నెముక వంటివన్నారు. డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ స్వరాలను సరిగ్గా పాడినప్పుడే శ్రోతలు మంత్రముగ్ధులవుతారన్నారు. కార్యక్రమంలో జి.శరత్ బాబు, డాక్టర్ వై.స్వర్ణశ్రీ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలో విద్యార్థినుల క్యూ

పరీక్షా సమయం

రాజమహేంద్రవరం సిటీ: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సమయానికి దాదాపు గంటకు ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. నగరంలోని కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల వద్ద రద్దీ నెలకొంది. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా కేంద్రానికి తరలివచ్చారు. తమ పిల్లలను దీవించి పరీక్షా కేంద్రాలకు పంపించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి లోపలకు అనుమతి ఇచ్చారు.



హాల్ టికెట్ నంబర్‌ను చూసుకుంటున్న విద్యార్థులు



విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



పరీక్ష రాసేందుకు వచ్చిన అంధ విద్యార్థిని

7 వరకూ మహిళా సాధికార వారోత్సవాలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7వ తేదీ వరకూ జిల్లాలో మహిళా సాధికారిత వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ నరసింహ కిషోర్ తెలిపారు. మహిళల భద్రత, పోలీసుల విధుల పట్ల విద్యార్థినులకు అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీస్ కార్యాలయంతో పాటు వివిధ పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌస్ నిర్వహిస్తున్నామని వివరించారు. వారోత్సవాల్లో భాగంగా వైద్య శిబిరాలు, వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు, ర్యాలీలు నిర్వహిస్తామన్నారు.

ఉత్సాహంగా మహిళల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న మహిళలు



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న మహిళా శిశు సంక్షేమ అధికారి విజయకుమారి తదితరులు

సీటీఆర్ఐ: మహిళల విషయంలో పురుషుల ఆలోచనా విధానం మారాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయ కుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక పుష్కర ఘాట్ నుంచీ దేవీ చౌక్ వరకూ శనివారం సాయంత్రం మహిళలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ కుమారి మాట్లాడుతూ ఆడ పిల్లల విద్య, వారి సామాజిక భాగస్వామ్యం, సమాజ పరిణామ క్రమంలో ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సుబ్బరాజు, డీఎస్పీలు భవ్య కిశోర్, బి.విద్య, సీఐ మంగాదేవి, ఎస్ఐ అమీనా బేగం, ఐసీడీఎస్ అధికారులు బేబీ రాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు గీత్ సంగీత్ విభావరి



విలేకరులతో సమావేశమైన మహ్మద్ ఖాన్, జిత్‌మోహన్‌మిత్ర

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గీత్ సంగీత్ సంస్థ ఆధ్వర్యంలో వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ఆదివారం సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు, విశ్రాంత అడిషనల్ ఎస్పీ మహ్మద్ ఖాన్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను రాజమహేంద్రవరం వాస్తవ్యుడినని, ఉద్యోగ విరమణ అనంతరం విశాఖలో స్థిరపడినట్టు తెలిపారు. తనకు పాటలు పాడడం అంటే అభిరుచి అన్నారు. తన సొంత ఊరిలో సంగీత విభావరి నిర్వహించాలన్న అభిలాషతో ఇక్కడ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. తమతో చదువుకున్న మిత్రులు చింతపెంట ప్రభాకర్ తదితరులు సహకారం అందిస్తున్నారన్నారు. జిత్ మోహన్‌మిత్ర, పిల్లాడి పరమహంస పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి కృషి



బొమ్మూరు పాలిటెక్నిక్ కళాశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామని పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సభ్యులు బోరుగడ్డ జోసఫ్, శ్రీనివాస్, రాజ్‌కుమార్ తెలిపారు. ఆ కళాశాలలో 1987 – 2021 వరకూ చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం జరిగింది. ముందుగా పూర్వ విద్యార్థులు కళాశాలలో కొత్తగా రెనోవేషన్ చేసిన అడ్మిన్, కంప్యూటర్ క్లాస్ రూమ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్‌లు, లైబ్రరీని సందర్శించారు. ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు, కంప్యూటర్, మెకానికల్, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ల హెడ్‌లను కలిసి కళాశాల అభివృద్ధిపై చర్చించారు. ప్రస్తుతం కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ 2015లో పూర్వ విద్యార్థుల ద్వారా ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందని, అన్ని డిపార్ట్‌మెంట్ల ల్యాబ్‌లను ఆధునీకరించడంతో పాటు, తరగతి గదులలో డ్రింకింగ్ వాటర్ సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

చెత్త సేకరణపై అవగాహన

కడియం: మండలంలోని వేమగిరిలో తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. ఈవోపీఆర్‌డీ రామ్‌ప్రసాద్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శి ఎం.రూప్‌చంద్ ఆధ్వర్యంలో గ్రామంలో విస్తృత ప్రచారం చేశారు. అంతకు ముందు చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం ద్వారా సేకరించిన చెత్తను ఏ విధంగా వినియోగిస్తున్నదీ ఈవోపీఆర్‌డీ పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని కోరారు.